# నియోజకవర్గంలో అనేక సమస్యలు పరిష్కరించాం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- తలసానిని సత్కరించిన వివిధ సంఘాల ప్రతినిధులు



పీజీ రోడ్డు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ డిసెంబర్ 15: తెలంగాణ ప్రభుత్వం హయాంలోనే సనత్‌నగర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గుర్తు చేశారు. తలసాని మూడవసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా శుక్రవారం నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, వివిధ కాలనీల ప్రతినిధులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ వారితో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పీజీ రోడ్డులో సరైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థలు లేక వర్షాకాలంలో స్థానిక ప్రజలే కాకుండా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారని వివరించారు. తాను వచ్చిన తర్వాతనే సుమారు రూ.40కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చానన్నారు. వైట్ ట్యాపింగ్ రోడ్డును నిర్మించి అద్భుతంగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. అదే విధంగా నాలా పూడిక తొలగింపు, నూతన వంతెనలు నిర్మించి వర్షాకాలంలో వరద ముంపు సమస్యలను పరిష్కరించినట్టు వివరించారు. ఇవే కాకుండా తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే అనేక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీజీ రోడ్డు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌తోపాటు సంజయ్, జగదీశ్ ప్రసాద్‌వర్మ తదితరులు పాల్గొని తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.

## అందరి సహకారంతోనే హ్యాట్రిక్ సాధ్యమైంది..

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట్, డిసెంబర్ 15 : సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మూడోసారి కూడా విజయం సాధించడంలో పార్టీ శ్రేణులతోపాటు ప్రజల తోడ్పాటు ఎంతో ఉందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు సర్వార్ కుల్వంత్ సింగ్(టిల్లు భాయ్) ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యకర్తల సమ్మేళనంలో ఎమ్మెల్యే తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పలువురు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశ వర్కర్లకు సర్దార్ కుల్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ చేశారు. పేదలకు రగ్గులు, స్వెట్టర్లు, జర్కిన్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాననే విషయాన్ని మరచిపోవద్దన్నారు. తన గెలుపుకు తోడ్పాటునందించిన ప్రతిఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, కొత్తపల్లి మధుసూదన్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు బాగిందర్‌సింగ్, సుమిత్ సింగ్, కూతురు నర్సింహ, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, హరిసింగ్, రాజేశ్వరి, అనిత, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న తలసాని. చిత్రంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, కుల్వంత్‌సింగ్

## విద్య, ఉపాధి కోసం యువత పోరాటాలు చేయాలి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 15: రాష్ట్రంలోని యువత విద్య, ఉపాధి అవకాశాల కోసం పోరాటాలు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కోఆర్డినేటర్‌గా శివసాయితేజను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. కృష్ణస్వరూప్ మాట్లాడుతూ..విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటిక్యాల గణేశ్, నాయకులు పాల్గొన్నారు.

## అభ్యుదయ భావాలు, ప్రజా సాహిత్య వ్యాప్తికి కృషి చేయాలి



హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సత్కారం చేస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, డిసెంబర్15: రాష్ట్రంలో అభ్యుదయ భావాలు,ప్రజా సాహిత్య వ్యాప్తికి కవులు, రచయితలు కృషి చేసి సమాజ ప్రగతికి దోహదపడాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఎమ్మెల్యేగా గెలుపొందిన కూనంనేని సాంబశివరావుకు సత్కారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలకు పాల్పడుతూ దేశాన్ని చీకటి యుగంలోకి నెట్టడంతో స్వేచ్ఛ కరువై అశాంతి, అసహనం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో మార్పులు తీసుకువచ్చి సామాజిక న్యాయం జరిగేలా కవులు, రచయితలు తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరాస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ఉపాధ్యక్షుడు నాగభూషణం, కార్య నిర్వాహక కార్యదర్శి కేవీఎల్, నాయకులు డి.కమలరెడ్డి, మద్దిలేటి, చంద్రమోహన్‌గౌడ్, పాండురంగారెడ్డి, రాజు, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## వీసా స్లాట్ బుకింగ్ మార్పిడి పేరుతో టోకరా

బంజారాహిల్స్, డిసెంబర్ 15:అమెరికా వీసా స్లాట్ మార్పిడి చేయాలనుకున్న వైద్యుడికి సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.10లోని గౌరీ శంకర్ కాలనీలోని స్వాతి ఆస్పత్రిలో పనిచేస్తున్న డా.హరికిశోర్ అనే వైద్యుడు అమెరికా వెళ్లడానికి వీసా కోసం దరఖాస్తు చేశాడు. అయితే కొన్ని కారణాలతో స్లాట్ బుకింగ్ మార్చుకోవాలనుకున్న హరికిశోర్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ఇటీవల విపిన్ కుమార్ అనే వ్యక్తి ఫోన్ చేసి వీసా స్లాట్ వేరేరోజుకు మారుస్తామని, దీనికోసం రూ.20 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని నమ్మ బలికాడు. దీంతో అతడు చెప్పిన నంబర్‌కు రూ.20వేలు పంపించిన హరికిశోర్ కాసేపటికి పరిశీలించగా..స్లాట్ మారకపోగా మొత్తానికే బ్లాక్ అయినట్లు తేలింది. దీంతో తనను సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించినట్లు గుర్తించిన హరికిశోర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మరణించిన వ్యక్తి ఆస్తిపత్రాలు, నగదు తస్కరణ

### మృతుడి సోదరి ఫిర్యాదుతో కేసు నమోదు

బంజారాహిల్స్.డిసెంబర్ 15: తన సోదరుడు చనిపోయిన తర్వాత అతడికి సంబంధించిన ఆస్తి పత్రాలు, నగదుతో సహా ఖరీదైన వస్తువులను కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.12ఎన్‌బీటీనగర్‌లో నివాసం ఉంటున్న బిపుల్ ధాలి అనే వ్యక్తి గత నెల 18వ తేదీన అధిక రక్తపోటుతో బాధపడుతూ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, అతడికి చెందిన నగదు, ఆస్తి పత్రాలు, సెల్‌ఫోన్లు, డెబిట్ కార్డులను స్వప్నతోపాటు శారద, స్వాతి అనే మహిళలు తస్కరించారని మృతుడి సోదరి సీమా బెనర్జీ శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్వప్న తన సోదరుడిని పెండ్లి చేసుకున్నానని చెబుతున్న మాటలు అబద్ధాలని, వారి పెండ్లికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని ఫిర్యాదులో పేర్కొంది. తన సోదరుడి ఆస్తిని కాజేసేందుకు ఈ ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రశ్నిస్తే తీవ్రంగా దూషించడంతోపాటు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. బంజారాహిల్స్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

బంజారాహిల్స్, డిసెంబర్ 15: మితిమీరిన వేగంతో దూసుకువచ్చిన బైక్ మరో బైక్‌ను ఢీకొట్టిన ఘటన బంజారాహిల్స్‌లో జరిగింది. ఈ ప్రమాదంలో బైక్ మీద ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, అతడి భార్య తీవ్రంగా గాయపడింది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాలిలాన్నాయి. కొత్తగూడ సమీపంలోని ప్రశాంత్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న సయ్యద్ అమీన్‌అహ్మద్(42) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత భార్య అరాఫత్ జహాన్‌తో కలిసి ఓ ఫంక్షన్‌కు వెళ్లిన అమీన్ అహ్మద్ తన బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. బంజారాహిల్స్ రోడ్ నం.12కి రాగానే అతివేగంగా వచ్చిన మరో బైక్ (ఏపీ 11 బీ8599) అమీన్ నడిపిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అమీన్‌తోపాటు అతడి భార్య అరాఫత్ జహాన్ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. అప్పటికే అమీన్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అరాఫత్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. మృతుడి సోదరుడు అఖీల్ అహ్మద్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 304ఏ, 337 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గృహ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి




పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తేకనాథ్, మంజుల, సంధ్య, ఉషా

ఖైరతాబాద్, డిసెంబర్ 15 : గృహాల్లో పనిచేసే కార్మికుల కోసం ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని అమలు చేయాలని గృహ కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు వర్గీస్ తేకనాథ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఐదు లక్షల మంది, మిగతా ప్రాంతాల్లో సుమారు ఆరు లక్షల మంది గృహ కార్మికులు ఉన్నారని తెలిపారు. దేశంలో మూడు కోట్ల మంది గృహ కార్మికులు ఉన్నారని, వీరిలో 95 శాతం మహిళలే ఉన్నారన్నారు. గృహ కార్మికులకు జీవిత బీమా కల్పించాలని, ఇంటి పనివారితో పాటు అసంఘటిత కార్మికులకు ఈఎస్‌ఐ వర్తింప చేయడానికి ఈఎస్‌ఐ చట్టాన్ని సవరించేందుకు రాష్ట్ర శాసన సభలో తీర్మానం చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన గోడపత్రికలను గృహ నిర్మాణ కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు జె. మాధూరి, కార్యదర్శి వి.మంజుల, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్యతో కలిసి ఆవిష్కరించారు.

## సర్దార్‌పటేల్‌కు ఘన నివాళి



ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ పటేల్‌నగర్‌లో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావుతోపాటు బస్తీ సంక్షేమ సంఘం నాయకులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. *– బంజారాహిల్స్, డిసెంబర్ 15*

## సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రోడ్డు నిర్మాణ పనులపై చర్చిస్తున్న మహాలక్ష్మిరామన్‌గౌడ్

హిమాయత్‌నగర్, డిసెంబర్15: పాడైన రోడ్లకు మరమ్మతులు, కొత్త సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ అధికారులకు సూచించారు. శుక్రవారం హిమాయత్‌నగర్ వీధి నం.2లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ ప్రవీణ్, ఏఈ దివ్య, బీఆర్‌ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సంధ్యారాణి

కాంగ్రెస్ పార్టీ హిమాయత్‌నగర్ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎస్.సంధ్యారాణి నియమితులయ్యారు. శుక్రవారం సంధ్యారాణికి పార్టీ మహిళా విభాగం ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు సంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.